సాక్షి
అన్నమయ్య జిల్లా
శనివారం ¦ 8 ¦ ఫిబ్రవరి ¦ 2025



ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధం

విద్యార్థులకు పరీక్ష సమయం ఆసన్నమైంది. ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులకు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. -8లో

న్యూస్‌రీల్

దరఖాస్తు గడువు పెంపు

లక్కిరెడ్డిపల్లి: బీసీ కార్పొరేషన్ల రుణాలను అర్హులందరికీ అందజేయడానికి లబ్ధి దారుల నుంచి వస్తున్న వినతులను దృష్టిలో పెట్టుకొని బీసీ, ఈడబ్ల్యూఎస్, కాపు, వివిధ కార్పొరేషన్ల ఆధ్వర్యంలో మంజూరు చేస్తున్న యూనిట్లకు దరఖాస్తు గడువును ఫిబ్రవరి 7 నుంచి 12వ తేదీ వరకు పెంచారు. ఈ విషయాన్ని జిల్లా బీసీ కార్పొరేషన్ కార్యనిర్వహణాధికారి జయహింస ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

అరుణాచలం, శ్రీశైలానికి ప్రత్యేక బసులు

రాజంపేట: అరుణాచలానికి 11న, శ్రీశైలానికి 25న ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపో మేనేజరు జి. రమణయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అరుణాచాలంలో పౌర్ణమి సందర్భంగా గిరిప్రదక్షణ కోసం బస్సు సర్వీసు నడుపుతున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ రిజర్వేషన్ సౌకర్యం ఉందన్నారు.చార్జీ రూ.965 ఉంటుందన్నారు. ఉదయం 6గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. అలాగే శ్రీశైలానికి రాత్రి 9గంటలకు బస్సు బయలుదేరుతుందన్నారు. రిజర్వేషన్ సౌకర్యం కల్పించామన్నారు. చార్జీ కేవలం రూ.655 మాత్రమేనన్నారు. వివరాలకు 99592 25775 (డీఎం), 6251612051(సీఐ), 738286 8442(ఎస్టీఐ), 9949860144(టీఐ), 9949580024 (ఏటీబీ ఏజెంట్) నంబర్లలో సంప్రందించాలన్నారు.

10 నుంచి రిజిస్ట్రేస్ చేసుకోవాలి

రాయచోటి: జిల్లాలో కందులు (రెడ్ గ్రామ్) అమ్మే రైతులు ఈనెల 10వ తేదీ నుంచి రైతు సేవా కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. కందులు క్వింటా మద్దతు ధర రూ. 7550గా ప్రకటించినట్లు తెలిపారు. జిల్లా మార్కెటింగ్ కమిటీ అధికారి, మార్క్‌ఫెడ్ కన్వీనర్ త్యాగరాజు, జిల్లావ్యవసాయ అధికారి చంద్ర నాయక్‌లతో తీసుకోవాల్సిన చర్యలపై జేసీ సమీక్షించారు. కందులు సాగుచేసిన రైతులు సోమవారం నుంచి రిజిస్ట్రేషన్లు నమోదు చేసుకునేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. రైతు సేవా కేంద్రాలలోని సిబ్బంది రిజిస్ట్రేషన్ పక్కాగా చేయాలని జేసీ సూచించారు.

గతవైభవం కనుమరుగు

- ఫైకప్పుదెబ్బతిని శిథిలమవుతున్న రంగిణీ మహల్
- గుప్తనిధుల కోసం మగ్బీరా డూమ్‌ను తవ్వేసిన దుండగులు
- రూపురేఖలు కోల్పోయిన కోట ముఖద్వారం
- పట్టించుకోని అధికారులు



ఓ వైపు కూలిపోయిన రంగిణీ మహల్ భవనం



శిథిలావస్థకు చేరుకొని కంపచెట్లతో నిండిపోయిన కోట ముఖద్వారం

గుర్రంకొండ: జిల్లాలోని గుర్రంకొండ, కంద్రిగ గ్రామాల్లో చారిత్రాత్మక కట్టడాలు శిథిలమైపోయి కనుమరుగు అవుతున్నాయి. కోటలోని రంగిణీ మహల్ వెనుకవైపు భవన పైకప్పు ఓవైపు ఇప్పటికే కూలిపోయింది. టిప్పు సుల్తాన్ మేనమామ గుర్రంకొండ కోట పాలకులు మీర్‌రజాఆలీఖాన్ సమాధి ఉన్న మగ్బీరా డూమ్‌ను గుప్తనిధుల కొసం దుండుగులు తవ్వేశారు. మగ్బీరా డూమ్ పైకప్పు ఓ చోట కూలిపోయి పెద్ద రంధ్రం ఏర్పడింది. మిగిలిన భాగాల్లో కూడా పెచ్చులు ఊడిపడతున్నాయి. గుర్రంకొండలోని టిప్పుసుల్తాన్ చదువుకొన్న పాఠశాల చారిత్రాత్మాక యూసూఫ్ సాహేబ్ తకియా కూడా శిథిలావస్థకు చేరుకొని మొండిగోడలు మిగిలాయి. కోట ముఖద్వారం కంపచెట్లతో నిండిపోయింది. అభివృద్ధి చేయాల్సిన పురావస్తుశాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లుగా వ్యవహరిస్తున్నారు.

గుప్తనిధుల కోసం మగ్బీరా డూమ్‌ను తవ్వేశారు

గుర్రంకొండ కోట పరిపాలకులు మీర్‌రజాఆలీఖాన్(టిప్పుసుల్తాన్ మేనమామ) సమాధి ఉన్న ప్రదేశాన్ని మగ్బీరా డూమ్ అంటారు. శిల్పసౌందర్యంతో నిర్మించిన ఈ కట్టడాన్ని దుండగులు గుప్తనిధుల కొసం తవ్వేశారు. 60 అడుగులమేరకు పెద్ద గొయ్యిని తవ్వేసి నాశనం చేశారు. గతంలో డూమ్ పైన నవాబుల కాలంలో ఏర్పాటు చేసిన చాంద్‌ను ఇతర పంచలోహ పాత్రలను దుండుగులు చోరీ చేసి ఎత్తుకెళ్లారు.ప్రస్తుతం మగ్బీరా డూమ్ శిథిలమై కూలిపోయే దశకు చేరుకొంది. టిప్పుసుల్తాన్ చిన్నతనంలో ఇక్కడి యూసూఫ్ సాహేబ్ తఖీయా (తఖీయా అంటే పాఠశాల అనిఅర్థం)లో విద్యాభ్యాసాన్ని కొనసాగించాడు. ఈపురాతన కట్టడం కూడా రూపురేఖలు కోల్పోయింది. నాటి కాలంలో నిర్మించిన ఇటుకల గోడలు మాత్రం ఉన్నాయి.

- గుర్రంకొండ కోటను కృష్ణదేవరాయలు, టిప్పుసుల్తాన్, మైసూర్‌రాజులు, బహుమనీసుల్తాన్, బ్రిటీషువారు పరిపాలించారు. ఇలాంటి కోట ముఖద్వారం నేడు దీనావస్థకు చేరుకొంది. ముందువైపు గోడ కూలిపోయింది. విష్ణేశ్వరస్వామి ఆలయం నుంచి కోట ముఖద్వారానికి వేళ్లే మార్గం మొత్తం కంపచెట్లతో నిండిపోయి ముసుకుపోయింది. దీంతో పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు.
- కోటకు సమీపంలో పురాతన రాతి మసీదులు శిథిలమైపోయాయి. సిమెంట్, మట్టి వినియోగించకుండా కేవలం రాళ్లతో నిర్మించడం వీటి ప్రత్యేకత. ప్రస్తుతం ఈకట్టడాలు తమ ప్రాభవాన్ని కోల్పోయాయి. జాతి సంపదను కాపాడుకోవాల్సిన ప్రభుత్వంగానీ, అధికారులుగానీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు.

మరమ్మతులేవి?

ప్రఖ్యాత రంగిణీ మహల్ ఓ వైపు కూలిపోయింది. భవనం పైకప్పు దెబ్బతింది. మరమ్మతుల గురించి పురావస్తుశాఖాధికారులు పట్టించుకోవడం లేదు.పూర్వపు నవాబులు తమ ఆస్థానంలోని ఆస్థాన నాట్యగత్తెగా ఉన్న రంగమ్మ పేరుతో ఈ మహల్ నిర్మించారని చరిత్ర చెబుతోంది. భవనం వైనుకవైపు రెండో అంతస్తు పైకప్పు ఓవైపు పూర్తిగా దెబ్బతిని కుంగిపోయింది. మిగిలింది ఎప్పుడు కూలిపోతోందోనని పర్యాటకలు భయాందోళన చెందుతున్నారు. అధికారులు పలుమార్లు పర్యటించి మరమ్మతులకు ఎంత మేరకు నిధులు అవసరమవుతాయో అంచనాలను రూపొందించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించారు. ఇంతవరకు మరమ్మతులు చేపట్టిన ధాఖలాలు లేవు.

జాతి సంపదను కాపాడాలి



గుర్రంకొండ, కంద్రిగ గ్రామాల్లో శిథిలావస్థకు చేరుకున్న పురా తన కట్టడాల మరమ్మతులకు కేంద్రపురావస్తుశాఖ నిధులను కేటాయించాలి. వీటికి మళ్లీ పూర్వవైభవం తీసుకురావాల్సి ఉంది. శిథిలమైపోతున్న జాతి సంపదను కాపాడాలి.

– ముక్తియార్, గుర్రంకొండ

ప్రతిపాదనలు పంపించాం

రంగిణీమహల్ మరమ్మతుల కోసం గతంలో ప్రతిపాదనలు పంపించాం. కేంద్ర పురావస్తుశాఖ నుంచి నిధులు మంజూరు కావాల్సి ఉంది. వీటితో పాటు కోటలో మరిన్ని అభివృద్ధి పనులు చేసేందుకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేపడతాం.

– రామ్మూర్తి, పురావస్తుశాఖాధికారి, గుర్రంకొండ

కడప రాయునికి పుష్పయాగం



కడప రాయునికి పుష్పయాగం నిర్వహిస్తున్న అర్చకులు

నల్లనయ్య అందాన్ని చూసి తెల్లబోయిన మల్లెలు, కలువలు... ఆయన నాజూకు తనం చూసి సిగ్గుల మొగ్గ సన్నజాజులు, ఎంత చక్కని రూపమంటూ రేకులు విప్పార్చుకుని చూస్తున్న సంపెగలు, ఆ సుకుమారుడిని తాకి మరింత మృదువుగా మారిన గులాబీలు, ఆ దివ్య సన్నిధిలో చోటు లభించినందుకు అంబరాన్ని అంటిన సంబరంతో కనకాంబరాలు, అది భాగ్యమని పరవశిస్తున్న బంతులు, చామంతులు ఇంకా...ఇంకా...ఎన్నెన్నో పూలు, ఎన్నెన్నో సువాసనలు... ఇదీ కడప రాయుడి సన్నిధిలో శుక్రవారం కనువిందు చేసిన దృశ్యం. శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామివారికి పుష్పయాగం జరిగింది. దాదాపు రెండు గంటలపాటు జరిగిన ఈ కార్యక్రమం భక్తులను పరవశింపజేసింది. ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పీఠంపై ఇరువైపుల దేవేరులతో కొలువుదీరిన వీరికి ప్రత్యేక పూజలు చేసి యాగాన్ని ప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు మయూరం కృష్ణమోహన్, తివిక్రమ్ సహాయకులతో కలిసి ఈ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ హనుమంతయ్య, ఇన్‌స్పెక్టర్ ఈశ్వర్‌రెడ్డి, మాజీ చైర్మన్లు, పాతకడప, దేవునికడప గ్రామాల పెద్దలు, భక్తులు పెద్ద సంఖ్యలో కార్యక్రమంలో పాల్గొన్నారు.

– కడప కల్చరల్



పుష్పయాగంలో పాల్గొన్న భక్తులు

క్లుప్తంగా

రహదారిపై కొండ చిలువ



రోడ్డు దాటుకుని వెళుతున్న కొండచిలువ

రాజుపాళెం : రాజుపాళెం–అయ్యవారిపల్లె రహదారిలో కేసీ చాపాడు కాల్వ వద్ద శుక్రవారం రాత్రి కొండచిలువ కనిపించినట్లు స్థానికులు తెలిపారు. రాత్రి 7.30 గంటల సమయంలో రహదారిపై ఒక వైపు నుంచి మరో వైపునకు వెళ్తున్న కొండచిలువను చూసి వాహనదారులు భయపడిపోయారు. కొంతసేపు ఆగి.. కొండ చిలువ వెళ్లిన తర్వాత ఇళ్లకు వెళ్లారు.

యువకుడికి తీవ్ర గాయాలు



చికిత్స పొందుతున్న పసల సన్నీ

చిన్నమండెం : మండలంలోని దేవగుడిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో పసల సన్నీకి గాయాలయ్యాయి. మండలంలోని కొండమూలకు చెందిన పసల రామాంజులు, సుజాతల కుమారుడు పసల సన్నీ ద్విచక్రవాహనంలో చిన్నమండెం నుంచి రాయచోటికి వెళ్తున్నారు. దేవగుడిపల్లె విద్యుత్ సబ్ స్టేషన్ వద్దకు రాగానే అదుపు తప్పి పడిపోయారు. వెంటనే క్షతగాత్రుడిని స్థానికులు తిరుపతికి తీసుకెళ్లగా.. మెరుగైన చికిత్స కొరకు వేలూరుకు తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

వ్యక్తి అదృశ్యం



భాస్కర్‌రెడ్డి (ఫైల్)

బి.కొత్తకోట : ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి తిరిగి రాలేదని కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు. స్థానిక రంగసముద్రం రోడ్డులో ఉంటున్న భాస్కర్‌రెడ్డి(49) ఈ నెల 5వ తేదీన మదనపల్లికి వెళ్లి వస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఇంత వరకు ఇంటికి రాలేదని అతడి భార్య సుక్కాదేవి ఇచ్చిన ఫిర్యాదుపై అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

విచ్చలవిడిగా కేబుల్ వైర్ల చోరీలు

– వారం రోజుల్లో 60 బోర్ల వద్ద రూ.6 లక్షల విలువైన తీగల చోరీ



కేబుల్ వైర్ చోరీ చేసిన దుండగులు

నిమ్మనపల్లె : వ్యవసాయ బోర్ల వద్ద కేబుల్ వైర్ల చోరీలు రైతులకు భయపెడుతున్నాయి. రైతులు పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడంతో దొంగలు పెట్రేగిపోతున్నారు. గత వారం రోజుల్లోనే అగ్రహారం, నిమ్మనపల్లె, తవళం గ్రామాలలో దాదాపు 60 వ్యవసాయ బోర్ల వద్ద రూ.6 లక్షల విలువైన కేబుల్ వైర్లు చోరీకి గురయ్యాయి. గురువారం రాత్రి మండలంలోని అగ్రహారం పంచాయతీ ఆరెపిరెడ్డిగారిపల్లెలో రైతు వెంకట రమణారెడ్డి వ్యవసాయ బోరు వద్ద 50 మీటర్ల కేబుల్ వైరు ఎత్తుకెళ్లారు. మార్కెట్‌లో ఈ కేబుల్ వైర్ మీటరు ధర రూ.150 కావడంతో దొంగలు కన్నేశారు. పంట సాగు చేసిన రైతులు తిరిగి వాటిని అమర్చుకోవడం ఆర్థిక భారంగా మారింది. పోలీసులు ఇప్పటికైనా దొంగలను పట్టుకోవాలని రైతులు కోరుతున్నారు.

ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధం

- 10 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు
- 63 కేంద్రాల్లో ముందస్తుగా ఏర్పాట్లు



ప్రాక్టికల్స్ పరీక్షకు సిద్ధం చేసిన ల్యాబ్

రాజంపేట టౌన్ : విద్యార్థులకు పరీక్ష సమయం ఆసన్నమైంది. ఇంటర్మీడియట్ జనరల్ విద్యార్థులకు ఈ నెల 10వ తేదీ నుంచి ప్రయోగ పరీక్షలు ప్రారంభంకానున్నాయి. శని, ఆదివారాలు సెలవులు రావడంతో ఆయా సబ్జెక్టుల అధ్యాపకులు తమ కళాశాలల్లో ప్రయోగ పరీక్షలకు సర్వం సిద్ధం చేశారు. ఈ నెల 10వ తేదీ నుంచి 14వ తేదీ వరకు మొదటి స్పెల్లో 32 కేంద్రాల్లోనూ, 15వ తేదీ నుంచి 19వ తేదీ వరకు రెండవ స్పెల్‌లో 31 కేంద్రాల్లోనూ పరీక్షలు జరగనున్నాయి.

నాన్ జంబ్లింగ్ విధానంలో పరీక్ష

ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలు నాన్ జంబ్లింగ్ విధానంలో జరగనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలలకు సంబంధించి 5,895 మంది ఎంపీసీ, 2,176 మంది బైపీసీ విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా అధికారులు పకడ్బందీ ఏర్పాట్లుచేశారు. ఇందులో భాగంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం కలగకుండా చూడాలని ఇప్పటికే సమన్వయ కమిటీ సమావేశాల్లో అధికారులకు ఆదేశాలందాయి. తాగు నీటి సౌకర్యం, ఫస్ట్ ఎయిడ్ వంటివి ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు.

సీసీ కెమెరాల నిఘాలో....

ప్రాక్టికల్స్ పరీక్షలు పూర్తిగా సీసీ కెమెరా నిఘాలో జరగనున్నాయి. ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు సైతం పర్యవేక్షించేలా ఏర్పాట్లుచేస్తున్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. పరీక్ష అనంతరం ఎగ్జామినర్స్ పేపర్ వ్యాల్యుయేషన్ చేసి మార్కులను ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సి ఉంటుంది. పరీక్షల పర్యవేక్షణకు హాజరయ్యే ఎగ్జామినర్ ఫోన్‌కు ఇంటర్మీడియట్ విద్యామండలి ఓటీపీని పంపిస్తుంది. తద్వారా కళాశాలలోని కంప్యూటర్ ద్వారా వెబ్‌సైట్‌లోకి వెళ్లి మార్కులు నమోదు చేయాల్సి వుంటుంది. ఈ ప్రక్రియ మొత్తం సీసీ కెమెరాల పర్యవేక్షణలోనే కొనసాగుతుంది.

పకడ్బందీ ఏర్పాట్లు



ఈ నెల 10వ తేదీ నుంచి 19వ తేదీ వరకు జరిగే ఇంటర్మీడియట్ ప్రాక్టికల్స్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నాం. విద్యార్థులకు అసౌకర్యం కలగకుండా చూడాలని ప్రిన్సిపాళ్లకు ఆదేశాలిచ్చాం. జిల్లాలోని అన్ని పరీక్షా కేంద్రాల్లో ఏర్పాట్లు సంతృప్తికర స్థాయిలో జరుగుతున్నాయి. పరీక్ష సమయానికంటే కనీసం ఒక అరగంట ముందుగా విద్యార్థులు పరీక్షా కేంద్రానికి చేరుకునేలా ప్రణాళిక రూపొందించుకోవాలి.

– ఎం.కృష్ణయ్య, డీఐఈఓ, అన్నమయ్యజిల్లా

మదనపల్లెలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

నేడు మదనపల్లె కోర్టు ఆవరణలో నూతన భవనాలు ప్రారంభం

మదనపల్లె : మదనపల్లె కోర్టు ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అడిషనల్ సివిల్ కోర్టు భవనాలను ప్రారంభించేందుకు శుక్రవారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్.వెంకటనారాయణభట్ మదనపల్లెకు చేరుకున్నారు. రాష్ట్ర సరిహద్దులోని చీకలబైలు చెక్‌పోస్టు వద్ద జిల్లా ప్రిన్సిపల్ జడ్జి భీమరావు, సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, డీఎస్పీ కొండయ్యనాయుడు న్యాయమూర్తికి ఘన స్వాగతం పలికారు. సొసైటీ కాలనీలోని ఇంటి వద్ద పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కోర్టుభవనాల ప్రారంభోత్సవానికి హాజరయ్యేందుకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు ప్రధానన్యాయమూర్తి ధీరజ్‌సింగ్‌ఠాగూర్, హైకోర్టు న్యాయమూర్తులు డి.క్రిష్ణమోహన్, కుంచం మహేశ్వరరావు, టి.సి.డి.శేఖర్‌లు మదనపల్లెకు చేరుకుని హార్సిలీహిల్స్‌లో బసచేశారు. శనివారం సుప్రీంకోర్టు న్యాయమూర్తి ఎస్.వెంకటనారాయణభట్‌తో కలిసి కోర్టు భవనాల ప్రారంభోత్సవాల కార్యక్రమాల్లో పాల్గొనున్నట్లు కోర్టు అధికారులు తెలిపారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జడ్జి ఈ.భీమరావు, మదనపల్లె బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొట్టి వెంకటరమణారెడ్డి తెలిపారు.

పంట నమోదు వివరాల తనిఖీ



రైతులకు సలహాలిస్తున్న జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్

లక్కిరెడ్డిపల్లి : ఆన్‌లైన్‌లో నమోదు చేసిన మండలంలోని కోనంపేట రైతుల పంట వివరాలను అన్నమయ్య జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ శుక్రవారం పరిశీలించారు. రైతుల రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పొలం పరిశీలించి రైతుల చరవాణిలో ఎస్‌పీసీసీ యాప్ డౌన్‌లోడ్ చేయించారు. యాప్ ద్వారా చీడపీడల నివారణకు సత్వర సలహాలను పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో లక్కిరెడ్డిపల్లి ఏడీఏ జయరాణి, ఏవో రమేష్ బాబూరావు, తహసీల్దారు శ్రీనివాసులు, అధికారులు, రైతులు పాల్గొన్నారు.

మోడల్ పంచాయతీలుగా మద్దిరేవుల, లక్కిరెడ్డిపల్లి

ఎన్‌ఐఆర్‌డీ శాఖ పరిశీలకులు ప్రసాద్



సమావేశంలో మాట్లాడుతున్న పరిశీలకులు ప్రసాద్

లక్కిరెడ్డిపల్లి : అన్నమయ్య జిల్లాలోని లక్కిరెడ్డిపల్లి, మద్దిరేవుల గ్రామాలను మోడల్ పంచాయతీలుగా ఎంపిక చేశారని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ పరిశీలకులు ప్రసాద్ పేర్కొన్నారు. లక్కిరెడ్డిపల్లి పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అధికారులతో శుక్రవారం ఆయన సమావేశం నిర్వహించారు. ప్రసాద్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా 115 గ్రామ పంచాయతీల అభివృద్ధికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించామని, ఇందులో భాగంగా మద్దిరేవుల పంచాయతీని సందర్శించామన్నారు. సర్పంచ్ తుమ్మలచంద్రమ్మ, పంచాయతీ కార్యదర్శి రజనీష్‌రెడ్డితో చర్చించి వారు రూపొందించిన ప్రణాళికపై సంతృప్తి వ్యక్తం చేశారు. విద్య, వైద్యం, పరిసరాల పరిశుభ్రత, మొక్కలు నాటడం, మెడికల్ క్యాంపులు నిర్వహించాలని, కూలీలకు వంద రోజుల ఉపాధి పనులు కల్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రజనీష్ రెడ్డి, సుదర్శన్ రెడ్డి, మద్దిరేవుల సర్పంచ్ తుమ్మల చంద్రమ్మ, అడ్వకేట్ తుమ్మల వంశీకృష్ణ పాల్గొన్నారు.

ఇద్దరు దొంగల అరెస్టు

రూ. 99వేల విలువచేసే వెండి వస్తువులు స్వాధీనం



పోలీసుల అదుపులో వెండివస్తువులు, నిందితులు

నందలూరు : కడప–తిరుపతి ప్రధాన రహదారిలో మూసివేసిన ఆల్విన్ కర్మాగారం వద్ద శుక్రవారం ఇద్దరు దొంగలను అరెస్టు చేసి వారి నుంచి రూ.99 వేల విలువగల వెండి వస్తువులు స్వాధీనం చేసుకున్నట్లు రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్‌నాథ్ వాగ్దే తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ఎస్ఐ వెంకటేశ్వర్లు తన సిబ్బందితో ఆల్విన్ ఫ్యాక్టరీ గేటు వద్దకు వెళ్లగా తలారి బాలకృష్ణ, పుల్లగుంట రామాంజి అనే వ్యక్తులు పారిపోయేందుకు ప్రయత్నించారు. వారిని వెంబడించి పట్టుకుని ఆరా తీయగా సంచిలో మూడు వెండి కిరీటాలు, రెండు వెండి పళ్లేలు, మూడు వెండి దీపాలు, ఒక శఠగోపం లభించాయి. ఆడపూరు గ్రామంలోని మంచాలమ్మ ఆలయంలో గత ఏడాది డిసెంబర్ 24న చోరీ చేసిన వస్తువులుగా వాటిని గుర్తించడం జరిగిందన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుల్ దర్బార్ బాషాను ఏఎస్పీ అభినందించారు. ఈ సమావేశంలో రాజంపేట రూరల్ సీఐ బీవీ.రమణ, ఏఎస్ఐలు సుబ్బరాయుడు, శంకర్ నాయక్, హెడ్ కానిస్టేబుల్ రాజగోపాల్, పోలీసులు పాల్గొన్నారు.

మాజీ ఫీల్డ్ అసిస్టెంట్‌పై దాడి చేశారంటూ ఫిర్యాదు

వీరబల్లి : మండలంలోని వంగిమళ్ల కస్పాకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ షేక్ సలీం మాజీ ఫీల్డ్ అసిస్టెంట్ అత్తర్ అహ్మద్‌బాషాపై దాడి చేశారని శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఇరువురూ తెలుగు దేశం పార్టీకి చెందిన వారే. అయితే అత్తర్ అహ్మద్ బాషా టీడీపీకి చెందిన సుగవాసి బాలసుబ్రహ్మణ్యం వర్గానికి చెందిన వ్యక్తి కావడంతో ఇతడిని తొలగించారు. జగన్‌మోహన్‌రాజు వర్గానికి చెందిన సాగా సలీంను ఫీల్డ్ అసిస్టెంట్‌గా నియమించారు. సలీం అక్రమాలకు పాల్పడుతున్నాడని అత్తర్ అహ్మద్ బాష ఇటీవల బయటపెట్టారు. దీంతో అహ్మద్ బాషాపై ఆగ్రహంతో దుర్భాషలాడుతూ షేక్ సలీం దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారిస్తున్నారు.

ఆయమ్మ తోసింది.. బాలుడి ఎముక విరిగింది



బాలుడు గౌతమ్

చిట్వేలి : అన్నం అడిగితే ఆయా బాలుడిని తోసేయడంతో అతడి ఎముక విరిగిపోయిన సంఘటన శుక్రవారం నేతివారిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లిన బాలుడు ఆకలై అన్నం అడిగారు. ఆయమ్మ ఆగ్రహంతో తోసేయడంతో కింద పడిపోయాడు. బాలుడు గౌతమ్‌కు కుడి వైపు, మెడ, భుజం మధ్యలో ఎముక విరిగిపోయిందని తల్లి నలగల చంద్రకళ తెలిపారు. అంగన్ వాడీ వర్కర్ జ్యోతి రెండు రోజులుగా సెలవులో ఉన్నట్లు బాలుడి తల్లి చంద్రకళ తెలిపారు. గౌతమ్‌ను రైల్వేకోడూరు మండలం ఫారంకు తీసుకెళ్లి కట్టు కట్టించినట్లు తెలిపారు. సీడీపీఓ రాజేశ్వరి వివరణ కోసం ప్రయత్నించగా ఆమె అందుబాటులో లేరు. కావున అధికారులు స్పందించి న్యాయం చేయాలని తల్లి చంద్రకళ కోరుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసంపై కేసులు

బి.కొత్తకోట : మండలంలోని అమరనారాయపురం, బాటవారకురవపల్లెల్లో దొంగలు విద్యుత్తు ట్రాన్స్‌ఫార్మర్ల ధ్వంసం చేయడంపై రెండు కేసులు నమోదు చేసినట్లు పోలీసులు శుక్రవారం తెలిపారు. ఆదినారాయణ, రెడ్డెప్ప, చిన్నరెడ్డెప్పలకు చెందిన వ్యవసాయబోర్లకు ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశారు. దొంగలు రెండు ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని వైరు తీసుకెళ్లారు. దీనిపై బి.కొత్తకోట, కురబలకోట ఏఈలు గిరిబాబు, శంకర్‌రెడ్డిలు ఇచ్చిన ఫిర్యాదులపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

నాణ్యమైన విద్యుత్తు అందిస్తాం

పీలేరు రూరల్ : విద్యుత్తు వినియోగదారులకు అంతరాయం లేని నాణ్యమైన విద్యుత్తు అందించాలని విద్యుత్ శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి ఆదేశించారు. పీలేరులో శుక్రవారం జరిగిన డివిజన్ స్థాయి సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ రూ.7 కోట్లతో నూతన విద్యుత్ సబ్ స్టేషన్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. పీలేరు మండలం నాయునివారిపల్లెలో–1, వాల్మీకిపురం మండలం టి.సాకిరేవులపల్లె గ్రామాలలో సబ్ స్టేషన్లను ఏర్పాటు చేయడానికి స్థలం పరిశీలిస్తున్నట్లు తెలిపారు.

కేవీకేలో శాస్త్రీయ సలహా సంఘం సమావేశం



కేవీకే ప్రదర్శనా క్షేత్రాలను పరిశీలిస్తున్న పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు

కలికిరి : స్థానిక కేవీకే కార్యాలయంలో 2025–26లో చేపట్టబోయే కార్యక్రమాల ప్రణాళికలపై శుక్రవారం శాస్త్రీయ సలహా సంఘం సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ప్రాంతీయ పరిశోధన స్థానం తిరుపతి సహ పరిశోధన సంచాలకులు డా.వి.సుమతి, వ్యవసాయ సాంకేతిక అను ప్రయోగ పరిశోధన సంస్థ డైరెక్టర్ డా.షేక్ మీరా, ఎన్జీరంగా వ్యవసాయ యూనివర్సిటీ విస్తరణ సంచాలకులు డా.శివనారాయణ కేవీకే ప్రదర్శనా క్షేత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా 2024–25లో కేవీకే ఆధ్వర్యంలో చేపట్టిన పనుల వివరాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమన్వయకర్త డా.మంజుల వివరించారు. వ్యవసాయ, అనుబంధ రంగాలలో ప్రస్తుత సమస్యలపై సమావేశంలో చర్చించారు. కేవీకేలో బయో రిసోర్స్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకోనున్నట్లు తీర్మానించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మహేశ్వర్‌రెడ్డి, దేవకి, వజంత, శ్రీనివాస్, తిరుమురుగన్, డా.గుణశేఖర్, సుకుమార్, రైతులు, కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఆదాయపు పన్ను బాధ్యతగా చెల్లించాలి

ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ వంశీధర్



ఇన్‌కంటాక్స్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న అడిషనల్ కమిషనర్ వంశీధర్

మదనపల్లె : పన్ను చెల్లింపుదారులు ఆదాయపు పన్ను బాధ్యతగా చెల్లించి నప్పుడే సమాజం, దేశం అభివృద్ధి చెందుతాయని ఇన్‌కంటాక్స్ అడిషనల్ కమిషనర్ వంశీధర్ అన్నారు. పట్టణంలోని ఎస్‌బీఐ కాలనీలో నూతన ఇన్‌కంటాక్స్ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్థికసంవత్సరం ముగియనున్న నేపథ్యంలో అడ్వాన్స్ టాక్స్ వసూళ్లపై దృష్టి పెట్టామన్నారు. పన్ను రూపంలో చెల్లించిన మొత్తాన్ని రీఫండ్ చేస్తామని చెప్పే దళారుల మాటలు నమ్మి మోసపోవద్దని, మదనపల్లెలో ఇలాగే ఓ వ్యక్తి కోట్ల రూపాయల కుంభకోణానికి పాల్పడి జైలుకెళ్లి విచారణ ఎదుర్కొంటున్నారన్నారు. 2023–24లో 136 మంది రీఫండ్ క్లెయిమ్స్ అనుమానాస్పదంగా ఉండడంతో నోటీసులు జారీచేసి, రూ.1.48కోట్లు వసూలు చేశామన్నారు. ఐటీ రిటర్న్స్‌లో చాలామంది ఇతరుల మెయిల్, ఐడీ, ఫోన్ నెంబర్లు పెట్టడం ద్వారా ఇబ్బందులు తెచ్చుకుంటున్నారన్నారు. 81 మందితో రివైజ్డ్ రిటర్న్స్ అప్‌డేట్ చేయించామన్నారు. పన్ను చెల్లింపుదారులు ప్రొఫెషనల్ చార్టర్డ్ అకౌంటెంట్లు, టాక్స్ ప్రాక్టీషనర్స్ ద్వారా టాక్స్ ప్లానింగ్ వేయించుకుని టాక్స్ మిగుల్చుకోవాలన్నారు. క్రమం తప్పకుండా, భాధ్యతగా పన్నులు చెల్లించాలన్నారు. ఈ కార్యక్రమంలో మదనపల్లె ఆదాయపుపన్ను శాఖ అధికారి టి.మహమ్మద్ ఫారుఖ్, ఇన్స్‌పెక్టర్ సూర్యబాబునాయక్, ఇన్‌కంటాక్స్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లక్ష్య ఛేదనకు క్రీడలు దోహదం చేస్తాయి



పరుగుపందెం విజేతలతో అధికారులు

రైల్వేకోడూరు అర్బన్ : యువతలో ఏకాగ్రత, లక్ష్య ఛేదనకు క్రీడలు దోహదం చేస్తాయని వైస్ చాన్సలర్ ఆచార్య గోపాల్ అన్నారు. రైల్వే కోడూరు మండలం అనంతరాజుపేటలోని డాక్టర్ వైస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అంతర్ కళాశాలల రాష్ట్ర స్థాయి క్రీడలు శుక్రవారంతో ముగిసాయి. గత నాలుగు రోజులుగా జరిగిన రన్నింగ్, కబడ్డీ, హైజంప్, త్రోబాల్ క్రీడలు, క్లే మోడలింగ్ (మట్టితో ఆకృతులు), వకృత్వ పోటీలలో 9 కళాశాలల విద్యార్థులు హోరాహోరీగా తలపడ్డారు. అనంతరాజుపేట విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ సాధించారు. వీసీ ఆచార్య గోపాల్ మాట్లాడుతూ క్రీడాకారుల్లో ప్రతిభ వెలికితీసేందుకు పోటీలు ఉపయోగ పడుతాయని తెలిపారు. క్రమశిక్షణతో కూడిన విద్య ఉన్నత శిఖరాలకు చేరుస్తుందని తెలిపారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శంకర్ వర్గీయులపై చర్యలు తీసుకోండి

– టీడీపీ అధ్యక్షుడికి జయచంద్రారెడ్డి వర్గీయుల ఫిర్యాదు



పల్లా శ్రీనివాస్‌కు ఫిర్యాదు చేస్తున్న టీడీపీ నేతలు

బి.కొత్తకోట : మాజీ ఎమ్మెల్యే శంకర్ వర్గీయులపై ఓడిపోయిన టీడీపీ అభ్యర్థి జయచంద్రారెడ్డి వర్గీయులు శుక్రవారం ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌కు రాత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. టీడీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయనను కలిసి తమ సమస్యలను విన్నవించారు. పార్టీ పదవులు పొందిన మండల కన్వీనర్లు, ఇతరా పార్టీ పదవుల్లోని నాయకులు వ్యతిరేకంగా పనిచేయడమేగాక, సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారాలు చేస్తూ పార్టీలో గందరగోళం సృష్టిస్తున్నారని వివరించారు. ఇన్‌ఛార్జి జయచంద్రారెడ్డికి వ్యతిరేకంగా గ్రూపు కడుతూ పార్టీకి నష్టం కలిగిస్తున్నారని ఫిర్యాదు చేశారు. పార్టీ నిర్ణయించిన వ్యక్తే తమకు నాయకుడని స్పష్టం చేశారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు



గాయపడిన ఇంజినీరింగ్ విద్యార్థి అభిషేక్

మదనపల్లె : వేర్వేరు ప్రమాదాల్లో నలుగురు గాయపడి స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ములకలచెరువు మండలం బురకాయలకోటకు చెందిన అభిషేక్ (19) ఇంజినీరింగ్ చదువుతుండగా అదే గ్రామానికి చెందిన డిగ్రీ విద్యార్థి షరీఫ్ (18 తో కలిసి ద్విచక్ర వాహనంలో కురబలకోట మండలం అంగళ్లులోని కాలేజీకి వస్తున్నారు. మార్గమధ్యంలోని బి.కొత్తకోట మండలం గోళ్లపల్లి వద్ద కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించగా, మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. అదే గ్రామానికి చెందిన జ్ఞానేంద్ర కుమార్(29) తన స్నేహితుడైన గోపాల్(25)తో కలిసి వ్యక్తిగత పనులపై మదనపల్లెకు వచ్చారు. పట్టణంలోని సీటీఎం రోడ్డులో వాహనంలో వస్తుండగా ఆటో ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు గాయపడగా గమనించిన స్థానికులు మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. జ్ఞానేంద్రకుమార్‌కు కాలు విరగడంతో మెరుగైన వైద్యం కోసం తిరుపతికి రెఫర్ చేశారు. సంబంధిత పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దోషిగా నిరూపిస్తే నా భూమి ఇచ్చేస్తా...!

- ఫ్రీహోల్డ్ భూముల ఆరోపణలు అవాస్తవం
- మాజీ మంత్రి పెద్దిరెడ్డితో 40 ఏళ్ల రాజకీయ అనుబంధం
- అభూత కల్పనలు, అవాస్తవాలతో ఈనాడు కథనం



మీడియాతో మాట్లాడుతున్న మాధవరెడ్డి

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన మదనపల్లె ఫైల్స్ కేసులో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, పీఏ తుకారాం, తనను దోషులుగా నిరూపిస్తే, అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసపల్లెలో ఫ్రీహోల్డ్ కింద తమ కుటుంబం కొనుగోలు చేసిన ఆస్తిని ఈనాడుకు రాసిచ్చేందుకు తాను సిద్ధమని వ్యాపారవేత్త, వైఎస్సార్‌సీపీ నాయకులు వంకిరెడ్డి మాధవరెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన ఇంట్లో మాట్లాడుతూ...మదనపల్లె దస్త్రాల దహనం కేసులో వేళ్లన్నీ పెద్దిరెడ్డి వైపే...శీర్షికతో ఈనాడు పత్రిక ప్రచురించిన కథనం పూర్తిగా అభూత కల్పన, అవాస్తవమని తెలిపారు. వైఎస్సార్‌సీపీలో కీలకనేతగా ఉన్నటువంటి మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన కుటుంబాన్ని రాజకీయంగా ఎదుర్కొనే దమ్ములేక కూటమి ప్రభుత్వం ఈనాడు ద్వారా బురద జల్లేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. మదనపల్లె మండలం వలసపల్లెలో.. ప్రభుత్వ నిబంధనల ప్రకారం మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యుల పేరుతో 15.32 ఎకరాలు, తన కుటుంబ సభ్యుల పేరుతో కొనుగోలు చేసిన 3.34 ఎకరాల భూమి తప్ప మరెక్కడైనా భూమి ఉన్నట్లు నిరూపిస్తే దేనికైనా తాము సిద్ధమేనన్నారు. మదనపల్లె సబ్ కలెక్టరేట్ ఫైళ్ల దగ్ధం ఘటనకు ఆరు నెలలకు ముందే 18.1.2024లో వలసపల్లె పంచాయతీలోని సర్వే నంబర్–546లో వై.రెడ్డెప్పకు చెందిన 3.34 ఎకరాల భూమిని, ఫ్రీహోల్డ్ జరిగి, విక్రయ హక్కులు సంక్రమించిన తర్వాత తాను కొనుగోలు చేశానన్నారు. ఆ భూమి అతడికి 38 ఏళ్ల క్రితం మంజూరైందన్నారు. భూమి కొనుగోలు ద్వారా సదరు భూమి ఖాతా నంబర్.5002గా 1బీ, అడంగల్ తమ పేరుపైకి మారిందన్నారు. ఆ భూమిలో రెండు షెడ్లు నిర్మించుకునేందుకు లీజుకు ఇస్తే.. నోటీసు ఇచ్చాడన్నారు. దానిపై 13.6.2024న హైకోర్టులో స్టే తెచ్చామని, ఆ ఆర్డర్‌లో పంచాయతీకి, పీకేఎం–ఉడాకు చెల్లించాల్సిన కన్వర్షన్ ఫీజు, పన్ను చెల్లించి ప్లాన్ అప్రూవల్ తీసుకోవాల్సిందిగా ఇంటీరియమ్ ఆర్డర్ ఇచ్చిందన్నారు. దాని ఆధారంగా చలానా నంబర్.81142155062024 కింద రూ.1,19,069 చెల్లించి, కన్వర్షన్ అప్రూవల్ కోసం తహసీల్దార్ కార్యాలయానికి దరఖాస్తు చేసుకోవడం జరిగిందన్నారు. 12.7.2024 తేదీన మదనపల్లె తహసీల్దార్ రమాదేవి దరఖాస్తును అప్రూవ్ చేస్తూ సబ్ కలెక్టరేట్‌కు ఫైల్ పంపారన్నారు. 18.7.2024న ఆర్డీఓ హరిప్రసాద్, మండల సర్వేయర్ సుబ్రహ్మణ్యం, వీఆర్వో కల్యాణి, రెవెన్యూ సిబ్బందితో కలిసి క్షేత్రస్థాయిలో భూమిని పరిశీలించి వెళ్లారన్నారు. ఈ తతంగం జరుగుతున్న సమయంలో 21.7.2024న మదనపల్లె సబ్ కలెక్టరేట్‌లో అగ్నిప్రమాద ఘటన జరిగిందన్నారు. దీనికి రాజకీయ రంగు పులిమేందుకు, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని ఇరికించేందుకు, తాను సబ్ కలెక్టరేట్‌కు వెళ్లిన విషయాన్ని సాకుగా చూపించి రాజకీయ కుట్ర చేశారన్నారు. ఘటనతో సంబంధం లేని తమను అందులో ఎలాగైనా దోషులుగా చిత్రీకరించేందుకు నానా తంటాలు పడుతున్నారన్నారు. గౌతమ్ తేజతో తాను 7 సార్లు 510 సెకన్లు మాట్లాడితే.. 510 నిమిషాలు మాట్లాడానని, కాల్ డేటా రికార్డుల పేరుతో అవాస్తవాలు రాశారన్నారు. తమ కుటుంబం కాంగ్రెస్, తర్వాత వైఎస్సార్‌సీపీలో కొనసాగుతోందని, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి డీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పటి నుంచి రాజకీయంగా పరిచయాలు ఉన్నాయన్నారు. పనులకు సంబంధించి బిల్లుల విషయమై ఏడాదిన్నర కాలంలో 52 ఫోన్ కాల్స్ చేస్తే, అదేదో తప్పుగా చూపడం ఈనాడుకే చెల్లిందన్నారు. ఇక పీఏ తుకారాం విషయానికి వస్తే..ఆయన రొంపిచెర్ల, పులిచెర్ల మండలాలకు ఇన్‌ఛార్జిగా ఉండటంతో 18 నెలల కాలంలో 331 ఫోన్‌కాల్స్ పలు విషయాలపై మాట్లాడడం జరిగిందన్నారు. అంతే కాకుండా...సబ్ కలెక్టరేట్ ఘటనకు నెల రోజుల ముందే విదేశాల్లో ఉన్న తన కుమార్తె వద్దకు ఆయన వెళ్లారన్నారు. ఫైళ్ల దహనం ఘటనలో తాను మూడో నిందితుడుగా ఉంటూ మదనపల్లెలో తిరుగుతున్నా విచారించలేదని ఈనాడు వాపోయిందని, చట్ట ప్రకారం హైకోర్టులో బెయిల్ తీసుకున్నామని, స్టే వచ్చిందన్నారు. విచారణకు సంబంధించి తమకు ఎలాంటి నోటీసు ఇవ్వలేదని, విచారణాధికారులు ఎప్పుడు పిలిచినా హాజరయ్యేందుకు తాను సిద్ధమన్నారు. ఈనాడులో పేర్కొన్న విధంగా నిషేధిత జాబితాలోని 14వేల ఎకరాల భూములు, తమ ప్రమేయంతో ఆర్డీఓ మురళీ ర్యెగులరైజ్ చేశాడని, ఏవేవో రాసేసిందని, తాను, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కొనుగోలు చేసింది కేవలం 18 ఎకరాలు మాత్రమేనన్నారు. మిగిలిన ఫ్రీహోల్డ్ భూములకు తమకు ఎలాంటి సంబంధం లేదన్నారు. తమ పరువు, ప్రతిష్టకు భంగం కలిగిస్తున్న ఈనాడుపై రూ.5 కోట్ల పరువునష్టం దావా వేస్తానని ఇదివరకే ప్రకటించామని పేర్కొన్నారు.